

# 52 కోట్ల విలువైన బంగారు టాయిలెట్ చోరీ

**5 నిమిషాల్లో అపహరించిన ఐదుగురు దొంగలు**

న్యూఢిల్లీ: కాదేదీ చోరీకి అనర్హం అన్న విషయాన్ని రుజువు చేస్తూ యూకేలోని బ్లెన్‌హీమ్ ప్యాలెస్‌లో రూ.52 కోట్ల విలువైన 18 క్యారట్ల బంగారు టాయిలెట్‌ను కొందరు చోరులు ఐదు నిమిషాల్లో అపహరించారు. 2019కు చెందిన ఈ కేసును బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ క్రౌన్ కోర్టు సోమవారం విచారించింది. డొనాల్డ్ ట్రంప్ కెరీర్‌తో ముడిపడి ఉన్న ఈ బంగారు టాయిలెట్ 2019 సెప్టెంబర్‌లో ఆక్స్‌ఫర్డ్‌లోని ప్యాలెస్‌లో ఏర్పాటు చేయగా, తెల్లవారు జామున ప్రవేశించిన నిందితులు ఐదు నిమిషాల్లో దానిని పెకలించుకుని పోయారు. అనంతరం పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. అయితే వారి నుంచి ఆర్ట్‌వర్క్‌ను ఇంకా స్వాధీనం చేసుకోలేదని, దానిని వారు విడగొట్టి అమ్మేసి ఉంటారని వారు భావిస్తున్నారు. చాలా జాగ్రత్తగా ముందస్తు ప్లాన్‌తో ఈ భారీ చోరీకి పాల్పడి ఉంటారని కోర్టు వ్యాఖ్యానించింది. నిందితులపై దోపిడీ, ఆస్తి బదలాయింపునకు కుట్ర, తదితర ఆరోపణలు నమోదు చేశారు.

# లాలూ, తేజస్వికి సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ల్యాండ్ ఫర్ జాబ్స్ స్కామ్‌లో రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్, కూతురు హేమా యాదవ్‌కు ఢిల్లీ కోర్టు మంగళవారం సమన్లు జారీ చేసింది. మార్చి 11 లోపు తన ముందు హాజరు కావాలని ప్రత్యేక జడ్జి విశాల్ గొగ్నె సమన్లలో పేర్కొన్నారు. లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో(2004–2009), రైల్వేలో ఉద్యోగాలు ఇప్పించేందుకు అభ్యర్థుల నుంచి భూములు తీసుకొన్నారన్న ఆరోపణలపై వీరి మీద కేసు నమోదైంది.

# ఐదుగురి దారుణ హత్య

**పెదనాన్న, పెద్దమ్మ, నానమ్మ, సోదరుడు, గర్ల్‌ఫ్రెండ్‌ను చంపిన యువకుడు**

**కేరళలోని తిరువనంతపురంలో కలకలం**

తిరువనంతపురం: కేరళలోని తిరువనంతపురంలో 23 ఏండ్ల యువకుడు దారుణానికి పాల్పడ్డాడు. అఫ్ఫాన్ వరుసగా తన కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులైన ఐదుగురిని కొట్టి చంపాడు. అనంతరం సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సోమవారం జరిగిన ఈ ఘటన స్థానికులను షాక్‌కు గురిచేసింది. తన తల్లిపైనా దాడి చేయగా, ఆమె దవాఖానలో కొన ఊపిరితో ఉన్నారు. అఫ్ఫాన్ వరుసగా మూడు ఇండ్లల్లో ఉన్నవారిపై పదునైన ఆయుధంతో దాడులకు దిగగా, ఈ ఘటనలో పెదనాన్న, పెద్దమ్మ, నానమ్మ, 13 ఏండ్ల సోదరుడు, గర్ల్‌ఫ్రెండ్ హతమైనట్టు పోలీసులు గుర్తించారు. అఫ్ఫాన్ తొలుత పదునైన ఆయుధంతో తన ఇంట్లో ఉన్న తల్లి, గర్ల్‌ఫ్రెండ్‌పై దాడికి పాల్పడ్డాడు. అటు తర్వాత 13 ఏండ్ల సోదరుడిని సుత్తితో కొట్టి హత్య చేశాడు. ఆ తర్వాత పెదనాన ఇంటికి వెళ్లి వాగ్వాదానికి దిగి.. వారిపైనా దాడికి పాల్పడ్డాడు. అటు తర్వాత నానమ్మ ఇంటికి వెళ్లి ఆమెను కూడా చంపినట్టు తెలిసింది. హత్యలకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# 300 మంది రోగులపై అఘాయిత్యం

- **అందులో అత్యధికులు బాలబాలికలే**
- **ఫ్రాన్స్‌లో క్రూర నేరాలకు పాల్పడ్డ సర్జన్**



పారిస్: పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న ఓ సర్జన్.. అత్యంత క్రూరమైన నేరాలకు పాల్పడ్డాడు. 299 మంది రోగులపై లైంగిక వేధింపులు, అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితుల్లో అత్యధిక మంది చిన్నారులేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఫ్రాన్స్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ కేసులో నిందితుడైన 74 ఏండ్ల జోయెల్ లి స్కార్నెక్.. కోర్టులో నేరాన్ని అంగీకరించాడు. సోమవారం ఈ కేసులో కోర్టు విచారణ సందర్భంగా అతడు మాట్లాడుతూ, 'అత్యంత క్రూరమైన చర్యలకు పాల్పడ్డా. ఎంతోమందిని లైంగికంగా వేధించా. అత్యాచారానికి పాల్పడ్డా. చేసిన తప్పులకు బాధ్యత వహిస్తున్నా' అని అన్నాడు. ఈ కేసులో న్యాయస్థానం 2020లో జోయెల్‌ను దోషిగా తేల్చి, 15 ఏండ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయగా.. షాకింగ్ విషయాలు బయటకు వచ్చాయి. న్యాయస్థానం అతడికి మరో 20 ఏండ్ల జైలు శిక్ష విధించే అవకాశముంది. 1989 నుంచి 2014 వరకు 299 మందిపై అత్యాచారానికి పాల్పడినట్టు అతడు కోర్టుకు తెలిపాడు. వీరిలో అత్యధికులు చిన్నారులేనని పేర్కొన్నాడు. జోయెల్ మానసికంగా విపరీత ఆలోచనా ధోరణి కలిగిన 'మేజర్ పర్వర్ట్'గా వైద్యులు తేల్చారు. నిందితుడు జోయెల్ ఫ్రాన్స్‌లోని ఓ దవాఖానలో సర్జన్‌గా పనిచేసేవాడు. రోగులు మత్తులో ఉండగా లైంగికదాడి జరిపినట్టు తెలిపాడు. అతడి ఇంట్లో సోదాలు జరుపగా మూడు లక్షలకుపైగా ఫొటోలు, 650 వరకు అశ్లీల వీడియోలు బయటపడ్డాయి.

# ఉక్రెయిన్‌కు అమెరికా షాక్

**ఐరాసలో రష్యాకు మద్దతుగా ఓటు**

న్యూయార్క్, ఫిబ్రవరి 25: ఉక్రెయిన్‌కు అమెరికా షాక్ ఇచ్చింది. ఐక్యరాజ్యసమితిలో రష్యాకు అనుకూలంగా ఓటు వేసింది. తమ దేశ భూభాగం నుంచి రష్యా వైదొలగాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐరాసలో ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి అమెరికా, దాని మిత్ర దేశాలు వ్యతిరేకంగా ఓటేశాయి. మరోవైపు చాలా యూరప్ దేశాలు తీర్మానానికి మద్దతు పలకడంతో అది ఆమోదం పొందింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యాకు అనుకూలంగా అమెరికా ఓటేయడం ఇదే తొలిసారి. ఐరాస సాధారణ అసెంబ్లీలో ఈ తీర్మానానికి అనుకూలంగా 93 దేశాలు ఓటేయగా, 18 దేశాలు వ్యతిరేంచాయి. భారత్ సహా 64 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. ఇంకోవైపు ఈ తీర్మానంలో 'రష్యా దురాక్రమణ' అనే విషయాన్ని ప్రస్తావించకుండా చేయాలని అమెరికా చేసిన ప్రయత్నాన్ని ఐరాస తిరస్కరించింది.

















